



అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 25 మే 2024 పేజీలు : 04

# పోలీసుల దిగ్బంధంలో తాడిపత్రి

**న- ఎమ్మెల్యే అభ్యర్థుల కదలికలపై నిఘా**
**- నిందితుల అరెస్టులపై ప్రత్యేక దృష్టి**





తాడిపత్రిలో నిత్యం పోలీసుల పహారా, పోలీసుల దిగ్బంధంలో తాడిపత్రి ప్రాంతం, పట్టణంలో నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణ

తాడిపత్రి, మే 24, ప్రభాతవార్త: ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న కొద్దీ తాడిపత్రి నియోజకవర్గంలో బందోబస్తును పోలీసు ఉన్నతాధికారులు మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న నేరాల్లో నిందితులుగా ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థులు జేసీ అస్మిత్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలు తమ కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవడానికి వెసులు బాటునిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వారు పట్టణంలోకి రాకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. కొత్త ఎస్పీ వచ్చి తాడిపత్రిలో పర్యటించాక పోలీసుల బందోబస్తు మరింతగా పెంచారు. డీఐజీ షిమోన్షి, ఎస్పీ గౌతమి శాలి, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు ప్రత్యక్షంగా బందోబస్తును పర్యవేక్షిస్తూ 144 సెక్షన్, 30 పోలీసు యాక్టులను కఠినంగా అమలు చేస్తున్నారు.

**అల్లర్లపై అప్రమత్తం..!**

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత నియోజకవర్గంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల రోజుతో పాటు తర్వాత జరిగిన ఘర్షణల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పలు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే కార్డన్ సర్చ్‌లు, కవాతులు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటు చేసుకుంటున్న విషయం విదితమే. ఎన్నికల రోజున పట్టణంలోని పాతకోట, ఓంశాతి నగర్, బోడాయిపల్లి, వంగనూరు, కోనుప్పలపాడు, రాయలచెరువు తదితర చోట్ల గొడవలు జరిగాయి. అప్పట్లో పోలీసు అధికారులు వీటిని సాధారణంగా జరిగేవిగానే భావించి తేలిగ్గా తీసుకున్నారు. పోలింగ్ నాటి గొడవలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలతోనే వాటి కట్టడి సాధ్యమనే భావన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

**నిందితుల అరెస్టులపై పురోగతి..!**

తాడిపత్రిలో ఎన్నికల సందర్భంగా జరిగిన దాడిలో పాల్గొన్న నిందితుల అరెస్టులను పోలీసులు వేగవంతం చేశారు. నియోజకవర్గంలోని అల్లర్ల కేసుల పురోగతిపై సిట్ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. 728 మంది నిందితుల్లో ఇప్పటి వరకు 102 మందిని మాత్రమే అరెస్టు చేయడం, గుర్తించిన వారిలో ఇంకా 294 మందిని అరెస్టు చేయాల్సి ఉండటం, 332 మందిని ఇంకా గుర్తించాల్సి ఉండటం, తాడిపత్రి సబ్‌డివిజన్ పరిధిలోని స్టేషన్ల వారీగా నిందితులను గుర్తించి వారి అరెస్టుకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలను సిట్ అధికారులు తాడపత్రిలోనే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. అజ్ఞాతంలో ఉన్న నేతల కోసం గాలింపు చర్యలు చేపట్టి అరెస్టులు చేయడానికి ముమ్మర ప్రయత్నాలు చేయాలని సిట్ అధికారులు పోలీసుకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లర్లలో పాల్గొన్న వారిని మాత్రమే అరెస్టు చేసేలా, సంబంధం లేనివారిని ఇబ్బంది పెట్టకుండా వదిలేసేలా పోలీసుల చర్యలు ఉంటుండటంతో అనవసర భయాందోళనకు గురవుతున్న వారికి ఉపశమనం కలుగుతోంది. ఇప్పటి వరకు తాడిపత్రి పట్టణ స్టేషన్ పరిధిలో 87 మంది, రూరల్ స్టేషన్ పరిధిలో 16 మంది, పెద్దపప్పూరు స్టేషన్ పరిధిలో 16 మంది వంతున 118 మంది నిందితులను గుర్తించినట్లు సమాచారం.

**అల్లర్లకు అడ్డుకట్ట వేసేలా ఆంక్షలు**

బాణాసంచా విక్రయాలపై తాత్కాలికంగా నిషేధం విధించినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఎస్పీ గౌతమిశాలి సిఫార్సు మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ వచ్చే నెల 6వ తేదీ వరకు బాణాసంచా తయారీ, క్రయ విక్రయాలు, రవాణాపై నిషేధం విధించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే సెక్షన్ 436 కింద కఠిన చర్యలు తప్పవని, ఆయా స్టేషన్ల పరిధిలోని బాణాసంచా విక్రయదారులను ముందస్తుగా బైండోవర్లు కూడా చేస్తున్నారు. అలాగే పెట్రోల్ బంకుల్లో వాహనాల్లో మినహా సీసాలు, కేన్లలో పెట్రోల్ నింపుతూ విక్రయించకూడదని ఆంక్షలు విధించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను అన్ని విభాగాల సమన్వయంతో శాంతియుతంగా పూర్తిచేయాలనే ఉద్దేశంతో సెలవులు ఇవ్వడం కుదరదని ఆయా శాఖల సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

**- శాంతిభద్రతలను కాపాడాలి - జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్**
**- ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వరాదు - జిల్లా ఎస్పి గౌతమిశాలి**




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ , హాజరైన అధికారులు, రాజకీయ పార్టీల అభ్యర్థులు

**అనంతపురం కలెక్టరేట్, మే 24 ప్రభాతవార్త**

సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ ప్రక్రియ, తదితర అంశాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎస్పి గౌతమిశాలితో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసిందని, అధికారులు, పోలీసులు కష్టపడి పనిచేశారన్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ కోసం ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించారని చాలా సంతోషంగా వుందన్నారు. ఎన్నికల ఫలితాలను స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలవుతోందని 133 సెక్షన్ కింద రాళ్లు, రప్పలు, కర్రలు లాంటి ఇతరులకు హాని కలిగించేవి ఎవరూ పెట్టుకోకూడదన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్ రూము ఏర్పాటు చేయడం, టవర్ ఏసిలు ఏర్పాటు చేస్తున్నామని, అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిగా చేపడుతున్నామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరూ ప్రవర్తించరాదని కలెక్టర్ పేర్కొన్నారు.

**ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వరాదు : జిల్లా ఎస్పి గౌతమిశాలి**

ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి హింసకు తావివ్వరాదని జిల్లా ఎస్పి గౌతమిశాలి సూచించారు. ఎవరైనా ఎటువంటి హింస సృష్టించినా, సృష్టించాలని చూసినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. లా అండ్ ఆర్డర్‌ను ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీలులేదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముఖ్యమైందని, ఇందు కోసం బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 8 మందిని జిల్లా బహిష్కరణ చేయడం జరిగిందన్నారు. ఎవరైతే గొడవలు చేసేందుకు ఆస్కారం వుందని గుర్తించామో వారిని బైండోవర్ చేస్తున్నామని, అవి ఇంకా కొనసాగుతాయన్నారు. కౌంటింగ్‌కు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని ప్రజా తీర్పును ఖచ్చితంగా స్వాగతించాలని ఈ విషయం కార్యకర్తలకు కూడా చెప్పాలన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా గెలుపు సంబరాలు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సందేహాలు వ్యక్తం చేయగా వారి సందేహాలను నివృత్తి చేశారు. కౌంటింగ్ కోసం ఏజెంట్ల నియామకం, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కౌంటింగ్ ప్రక్రియలో ఏం చేయాలి, ఏం చేయకూడదన్న విధి విధానాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమీషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్‌నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పి విజయభాస్కర్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు రాణిసుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, జి.వెంకటేష్, పార్లమెంటరీ నియోజకవర్గం ఏఆర్ఒ రమేష్‌రెడ్డి, ఈఆర్ఒ శిరీష, కలెక్టరేట్ ఎఒ అంజన్‌బాబు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పనులు జరుగవు.. కానీ బిల్లులు మంజూరు అవుతున్నాయి..

**- అధికారుల కోసమే ఉపాధి పనులు..! - ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం తోనే అక్రమాలు..!**




చెరువు స్థలంలో ఫారం పాండ్ గుంత తీస్తున్న కూలీలు

**ధర్మవరం, మే 24 ప్రభాతవార్త**

ప్రభుత్వం వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు, రైతు కూలీలు పంటలు పండక బ్రతుకు తెరువు కోసం వలసలు పోకూడదన్న ఉద్దేశ్యంతో భారమవుతున్నాప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలు, పేద రైతుల కోసం ఉపాధిహామీ పథకం ద్వారా అనేక పనులు కల్పించి కూలీలకు ఉపాధి చూపిస్తుంటే.. కొందరు అధికారులు.. ఉపాధి సిబ్బంది ఈ ఉపాధిహామీ పథకాన్ని తమ ఉపాధిగా మార్చుకుని భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ధర్మవరం మండలంలో 18 పంచాయితీలు ఉండగా అన్ని పంచాయితీలలో కూలీలకు పనులు కల్పించడమే కాకుండా రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పనులు నిర్వహించాల్సి ఉంది. అయితే కొన్ని పంచాయితీలలో పనులే పూర్తి స్థాయిలో నిర్వహించకపోయినప్పటికీ బిల్లులు మాత్రం.. ప్రతివారం మంజూరు అవుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మండల ఏపిఒ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు ఏ మాత్రం నిర్వహించుకున్నప్పటికీ ప్రతివారం బిల్లులు మంజూరు చేయించుకుని మండల స్థాయి అధికారుల నుంచి క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్) వరకు అందరూ వాటాలు పంచుకుంటున్నట్టు ఆరోపణలు మెండుగానే వినిపిస్తున్నాయి. ఇదీ చాలదన్నట్టు కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు ఇచ్చే బిల్లులో కూడా వాటాలు పనులు చేస్తున్నారు. ఉపాధి సిబ్బంది అధఙకారులు క ఉమ్మక్కై కేవలం వారి బాటాల కలెక్షన్ల కోసమే డ్యూటీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు అధికం అవ్వడంతోనే దాదాపు 5 మ ంది ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం, విధులకు దూరంగా ఉంచడం లాంటి కార్యక్రమాలు కూడా జరిగాయి. అయినప్పటికీ తొలగింపబడిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో కొందరు బినామీలను ఏర్పాటు చేసుకుని టెక్నికల్ అసిస్టెంట్లు కూడా కలెక్షన్లలో కీలక పాత్ర వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పనుల్లో అనేక అక్రమాలకు పాల్పడమే కాకుండా బిల్లులు మంజూరైన తర్వాత కూలీల వద్ద నుంచి కలెక్షన్లు కూడా భారీగా వసూలు చేసి వాటాలు పంచుకుంటున్నారని ఇది గిట్టని కొందరు ఉపాధి సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. ఈ వ్యవహారాలన్నీ మండల ఏపిఒ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను తన గుప్పెట్లో పెట్టుకుని ఈ వ్యవహారాలన్నీ నడుపుతున్నారని అంతేకాకుండా ఎటువంటి సంబంధం లేకున్నపట్టికీ స్థానిక నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి తన బంధువేనని పత్రికల్లో కథనాలు వచ్చినా, ఉ న్నతాధికారులు విచారణ చేసినా తనకూ.. తన సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది ఉండదని మండల ఏపిఒ తన కింది స్థాయి సిబ్బందికి భరోసా చెబుతున్నాడని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు బాహాటంగా చెబుతున్నారు. సామాజిక తనిఖీ బృందాలు ఉ న్నతస్థాయి అధికారుల బృందాలు విచారణకు వచ్చినప్పుడు మాత్రం వాటాలలో కాస్తో..కూస్తో.. కొంచెం వారికి సహకరిస్తే సరిపోతుందని మండల ఏపీఒ తమ ఉపాధి సిబ్బందికి ఉచిత సలహాలు చెబుతున్నట్లు కొందరు ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. ఇంత వ్యవహారం జరుగుతున్నా మండల అభివృద్ధి అధికారి కానీ పై స్థాయి అధికార యంత్రాంగం కానీ క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల పర్యవేక్షణ చేపట్టలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉన్నట్టా.. లేనట్టా.. అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. కరువు ప్రాంతంలో కూలీలకు పనులు కల్పించాల్సిందిపోయి కేవలం బిల్లుల కోసమే ఉపాధి పనులు నిర్వహిస్తున్నట్టు తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహించి బిల్లులు కొల్లగొడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని అక్రమాలు జరుగుతున్న నేలకోట, బిల్వంపల్లి, ఓబులనాయునిపల్లి, ఏలుకుంట్ల, మల్కాపురం రావులచెరువు, కుణుతూరు, సీతారాంపల్లి, ముచ్చరామి గ్రామాలతోపాటు మరికొన్ని పంచాయితీలలో విచారణ జరిపించాలని కూలీలు, రైతు సంఘం నాయకులు, మండల రైతులు కోరుతున్నారు.

# నేత్రపర్వంగా హంస వాహనోత్సవం

**-శ్రీదేవి, భూదేవి సమేతుడై దర్శనమిచ్చిన నృసింహస్వామి -లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు**



దేవేరులతో కలిసి హంస వాహనంపై విహరిస్తున్న నారసింహుడు



ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి



లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

**ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెన్నహోబిళంలో ఈనెల 20వ తేది నుండి ప్రారంభమైన లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం బహుళ పాడ్యమి శుక్రవారం శ్రీవారి హంస వాహనోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ ఉభయ దాతలు వెంటరాగా కొండ క్రిందకు తీసుకువచ్చి శోభాయమానంగా తీర్చిదిద్దిన హంస వాహనంపై కొలువుదీర్చి ప్రధాన ఆలయం చుట్టూ ప్రదీక్షిణల ద్వారా ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలు మహాభిషేకం, అలంకరణ, అర్చన, ఉత్సవ నిత్యహోమం, బలిహరణ, మంగళహారతి కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకనాధాచార్యులు, గుండుస్వామి, ఉత్సవ ఉభయ దారులు ఆమిద్యాలకు చెందిన వేలూరు నారమ్మ కుటుంబం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వేరుశెనగ విత్తన పంపిణీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**- నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి....**
**- విత్తన పంపిణీ కేంద్రంలో స్లాట్ పద్ధతిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలి...**
**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్.వి(ఐఏఎస్)**




వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ , సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్.వి

**గుమ్మఘట్ట, మే 24 ప్రభాతవార్త:**

నాణ్యమైన వేరుశెనగ విత్తనాలను రైతులకు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్.వి(ఐఏఎస్) ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాము వద్ద వేరుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాకలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 0-05 ఎకరాలు ఉన్న రైతుకు 30కేజీల బ్యాగ్ ఒకటి, 0.5-1.0ఎకరాలు ఉన్నరైతుకి 30కేజీల బ్యాగులు రెండు, 1.01ఎకరాల పైనున్న వారికి 30కేజీల వేరుశెనగ విత్తనాల బ్యాగులు మూడు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతుకు విత్తన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వేరుశెనగ విత్తనాలను పంపిణీ కేంద్రంలో స్లాట్ పద్ధతిలో రైతులకు పంపిణీ చేయాలని, దీని ద్వారా విత్తన పంపిణీ కేంద్రంలో హడావిడి ఉండదన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా విత్తనాల పేమెంట్ చేయాలన్నారు. రైతులకు ఎక్కువ విత్తనం అవసరం ఉందని ముందుగా చెబితే అదనంగా విత్తనాలు తీసఉకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వేరుశెనగ విత్తన పంపిణీకి సంబంధించి ఆల్ ఇండియా రేడియోలో లైవ్ కార్యక్రమం పెట్టాలని, రైతుల సందేహాలు, ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఆధికారులు సమన్వయంతో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీకి ఫ్లయింగ్‌స్క్వాడ్ నియామకం చేయాలని, జాయింగ్ కలెక్టర్ ఒక బృందం, సివిల్‌సప్లై, రెవెన్యూ శాఖల నుంచి స్క్వాడ్ పెట్టాలని, స్క్వాడ్ యూనిట్లలో పర్యటించి విత్తనాలు నాణ్యతంగా ఉన్నాయా లేదా అనేది నివేదిక ఇవ్వాలన్నారు. రైతులు ఏ పంట మీకు ఉపయోగంగా ఉంటుంది అనేది వ్యవసాయ అధికారులకు తెలపాలన్నారు. పంట మార్పిడి వల్ల రైతుకు ఉపయోగం ఉంటుందని, రాబోయే రోజుల్లో ప్రతి మండలం, గ్రామాల్లో ఈ విషయమై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. గుమఘట్ట మండలానికి 4,600క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాన్ని కేటాయించడం జరిగిందని, వేరుశెనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓ రాణిసుస్మిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడిఏ లక్ష్మినాయక్, ఏఓ నిర్మల్‌కుమార్, తహాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ గౌరీదేవి, ఆర్‌బికే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయినోళ్లు లేరు..అనాధలుగా పసి ప్రాణాలు

**- తండ్రి మరణం..మతిస్థిమితం లేని తల్లి - నా అన్న వాళ్లు లేక నానా అవస్థలు - ఆఖరికి దూరపు బంధువు నీడలో**
**- విద్యాభ్యాసం కోసం పసి పిల్లల తారాస - అధికారులు దృష్టి పెడితేనే బాధ్యత, విద్య**



అనారోగ్యంతో మెయిన్‌రోడ్డుపై పడుకున్న దుర్గశ్రీ



తన పరిస్థితి చెబుతున్న చిన్నారి లీలావతి

**చిలమత్తూరు, మే 24 ప్రభాతవార్త**

తండ్రి అనారోగ్యంతో మరణం..తండ్రి మరణానంతరం తల్లి వివిధ కారణాలతో మతిస్థిమితం లేక కనబడక పట్టించుకోకపోవడం..ఆలనా పాలనా చూస్తున్న వరుసకు అమ్మమ్మకు కూడా వయసు పైబడడంతో ఆమె కూడా మరణించింది. చూసేవాళ్లు లేక నా అన్న వాళ్లు అసలు లేరు. ఎవరైనా పెట్టింది తింటే తప్ప కడుపు నిండని పరిస్థితి. ఏ పాపం చేశారో తెలియదు గాని ఆ ముక్కుపచ్చలారని ఇద్దరి ఆడ పిల్లల జీవన శైలి పరిస్థితి చూస్తే కడుపు తరుక్కు పోతంది. ఇలా సమాజంలో అన్ని వున్న అయిన వాళ్లు దూరమై, జానెడు పొట్ట నింపు కొనేందుకు ఆపన్న హస్తాల సహాయ ఎదురు చూపుల్లో బిక్కు బిక్కు మంటూ ఆ ఆడ బిడ్డలు జీవిస్తున్నారు. ఈ ఇద్దరి బాలికల జీవితం చూసిన వారి దూరపు బంధువు ఒక వృద్ధుడు ప్రస్తుతం వారికి ఆసరయ్యాడు. కాని ఆ వృద్ధుడి జీవనం కూడా అంత మాత్రమే. ఈ ఇద్దరి బాలికల పరిస్థితి గురించి వివరాల్లోకి వెళితే తిప్పక్కకు చలివెందులకు చెందిన నాగరాజు అనే వ్యక్తితో వివాహమై లీలావతి (13), దుర్గశ్రీ (11) అను ఇరువురు సంతానం కలిగారు. ఇటీవల భర్త చనిపోవడంతో ఆపై మతిస్థిమితం లేక తిప్పక్క కనబడక పోవడంతో వరుసకు అమ్మమ్మ అయిన వృద్ధురాలి వద్ద లీలావతి, దుర్గశ్రీలు జీవిస్తున్నారు. ఇటీవల ఆ వృద్ధురాలు మరణించడం, నానా అవస్థలు పడుతున్న ఈ ఆడ బిడ్డలను దూరపు బంధువు అయిన నల్లబొమ్మనపల్లికి చెందిన అంజినప్ప అనే వృద్ధుడి సంరక్షణలో ప్రస్తుతం బాలికలు వున్నారు. మూడు రోజుల క్రితం మెయిన్ రోడ్డుపై జ్వరంతో బాధపడుతున్న బాలిక దుర్గశ్రీ పరిస్థితి గమనించిన ప్రభాతవార్త వీరి పరిస్థితి గురించి ఆరా తీస్తే బాలికలు చెప్పిన మాటలు కన్నీళ్లు తెప్పించేలా వారి పరిస్థితులు పై చెప్పిన విధంగా అద్దం పట్టాయి.

**కస్తూరిబాలో గానీ, టేకులోడు గురుకులంలో గానీ సీటు ఇప్పించండి :**

సంరక్షణ చేస్తున్న వృద్ధుడు అంజినప్ప ఈ బాలికలు ఇద్దరికి మండలంలోని కెజిబివిలో గానీ, టేకులోడు గురుకులంలో గానీ సీటు ఇప్పించి వీరి విద్యాభివృద్ధికి అధికారులు స్పందించాలని బాలికలను సంరక్షిస్తున్న వృద్ధుడు అంజినప్ప ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం తన బ్రతుకు కూడా భారమైందని ముందస్తుగానే ఈ ఆడ బిడ్డలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో ఆపన్నహస్తాల రూపంలో అధికారులు ముందుకు రావాలని ఆయన కోరుతున్నారు.

02ATP27_02ATP27.qxd 24-05-2024 PM 10:36 Page 1



## తహాశీల్దారు కార్యాలయం ఖాళీ.. విధులకు హాజరు కాని అధికారులు

శెట్టూరు, మే 24 ప్రభాతవార్త



ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న తహాశీల్దారు కార్యాలయం

స్థానిక తహాశీల్దార్ ఆఫీస్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రైతులు వివిధ పనుల నిమిత్తం తహాశీల్దారు ఆఫీస్‌లో తహాశీల్దారు కోసం కార్యాలయం ముందరే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తహాశీల్దార్ కోసం వేసినారు కానీ తహాశీల్దారు వేచి చూసిన కూడా తహాశీల్దారు రాకపోవడంతో నిరాశతో రైతులు జరిగింది వివిధ గ్రామాల నుంచి రైతులు తమ పనుల కోసం తహాశీల్దార్ ఆఫీస్ దగ్గరికి వస్తే తహాశీల్దారు లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. కార్యాలయంలో పని చేసే సిబ్బందిని రైతులు తహాశీల్దారు గురించి 11 గంటలకు వస్తారు రెండు గంటలకు వస్తారు అని చెప్పి రైతులని వేచి ఉండేలా చేశారు. చివరికి తహాశీల్దారు రాకపోవడంతో రైతులు వెనుతిరిగి వాళ్ల సొంత గ్రామాలకు వెళ్లారు. ఇలా జరగడం కొత్తేమి కాదు.. ఇక్కడ పని చేసే తహాశీల్దారు సమయపాలన పాటించడం పోవడం ఒక్కటే కాకుండా అందుబాటులో లేదు అనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రైతులకు అసలే ఇప్పుడు బ్యాంకులో తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే సమయం కాబట్టి రైతులకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రైతులకు 90 శాతం సబ్సిడితో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

కళ్యాణదుర్గం టౌన్, మే 24 ప్రభాతవార్త


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతులకు 90 శాతం సబ్సిడితో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని, కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ తహాశీల్దారు శ్యామ్‌రాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ.. 2023 ఖరీఫ్ ప్రభావం వల్ల పంటలు మొత్తంగా నష్టపోయాయి. కరువు పరిస్థితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు పరిశీలించి జిల్లాలోని 29 మండలాలను కరువు మ ండలాలుగా ప్రకటించారు. ఈ ఖరీఫ్ ప్రారంభం నుంచే జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాలు బాగా పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటించడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. అయితే గత సంవత్సరం పంటల నష్టం వల్ల సాగుకు అవసరమైన పెట్టుబడులు లేకపోవడం తీవ్ర సమస్యగా ఉంది. మన ప్రాంతంలో ప్రధానంగా వేరుశనగ సాగు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం గతం మాదిరే 40 శాతం సబ్సిడితో సరఫరా చేయాలని నిర్ణయించిందన్నారు.

## అనారోగ్య బాధితుడికి ఆత్మస్థైర్యాన్ని నింపిన బద్దేనాయక్

- బాదితుడికి రూ.30వేలు ఆర్థిక సాయం

శెట్టూరు, మే 24 ప్రభాతవార్త


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

మండల కేంద్రానికి చెందిన మూర్తి (38) వెన్నముఖ సమస్యతో బాదపడుతున్నారు. నిన్నటిరోజు చికిత్స కోసం అనంతపురంలోని ప్రముఖ ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్లు వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ 1,50,000 అవుతుందని వైద్యులు తెలిపారు. విషయం విన్న బాధితులు డబ్బులు లేక వెనుతిరిగి వచ్చేశారు. ఆపరేషన్ చేయకపోతే పెరాలసిస్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు సూచించడంతో దిక్కుతోచని స్థితిలో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను స్నేహితుల ద్వారా సంప్రదించగా స్పందించి ట్రస్టు చైర్మన్ బద్దే నాయక్ ట్రస్టు తరుపున 30వేలు చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సురేష్, ట్రస్ట్ కోశాధికారి అబ్దుల్ వాహబ్, సభ్యులు లోకేష్ పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనాల పంపిణీ

కంబదూరు, మే 24 ప్రభాతవార్త


వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కంబదూరు మండల వ్యాప్తంగా 14 రైతు భరోసా కేంద్రాల పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు శుక్రవారం మండల వ్యవసాయ అధికారి జాఫర్ ఆధ్వర్యంలో వేరు శనగ విత్తనాల ను పంపిణీచేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ విత్తనాల కోసం ఇంకా రిజిస్ట్రేషన్‌చేసుకొని రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డులతో రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకుని వేరుశనగ విత్తనాలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా విక్రయిస్తున్న పెట్రోల్ పట్టివేత

కంబదూరు, మే 24 ప్రభాతవార్త

ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా కంబదూరు మండల కేంద్రంలో ఓ కిరాణా షాపులో అక్రమంగా విక్రయిస్తున్న 10 లీటర్ల పెట్రోల్‌ను సీజ్ చేసినట్లు తహాశీల్దార్ నిత్యానంద బాబు శుక్రవారం మీడియాతో తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు పెట్రోలును వాటర్ బాటిల్లలో విక్రయించరాదని సూచించారు. ఒకవేళ ఎవరైనా అక్రమంగా పెట్రోల్ విక్రయిస్తే సంబంధిత పెట్రోల్ బంకులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ పెట్రోల్‌ను పెట్టుకున్న డిప్యూటీ తహాశీల్దార్ నారాయణస్వామిని ఇతర రెవెన్యూ సిబ్బందిని తహాశీల్దారు అభినందించారు.



పట్టుకున్న పెట్రోల్‌ను చూపుతున్న పోలీసులు

## హనుమద్‌వాహనోత్సవం పై వెంకటరమణుడు

రాయదుర్గం, మే 23 ప్రభాతవార్త:


హనుమద్వవాహనోత్సవంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు..

పట్టణంలోని కోటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెంకటరమణుడు శ్రీదేవి భూదేవి సమేతంగా హనుమద్వవాహనోత్సవం పై దుర్గం ప్రధాన రహదారుల్లో ఊరేగాడు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయాన్నే స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, గంగపూజ, పంచామృతాబిషేకం, పుష్పఅలంకరణ, వస్త్ర అలంకరణ, నైవేద్యం, మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు తదితర పూజలు చేపట్టారు. సాయంకాలం 6గంటలకు స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన హనుమద్వవాహనోత్సము పై స్వామివారి మూలవిరాట్‌ను ఉంచి ఆలయం నుండి తేరుబజార్ మీదుగా వినాయకసర్కిల్, పాతబస్టాండ్, లక్ష్మిబజార్, ఆర్అండ్‌బి అథితిగృహం వరకు స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సుగాలి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నేడు స్వామివారి కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు పేర్కొన్నారు.

## రాయదుర్గంను కరువు నియోజకవర్గంగా ప్రకటించాలి

కణేకల్లు, మే 24 ప్రభాతవార్త:


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోరి నాగరాజు

రాయదుర్గం నియోజకవర్గంలో ఐదు మండలాల్లో బొమ్మనహాళ్ మండలం 10సంవత్సరాల క్రితం రైతుకు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సీడి గానీ, ఇన్సూరెన్స్ గానీ రైతుకు సంబంధించిన యాంత్రాలు గానీ వచ్చేవని, కానీ ఒక వ్యక్తి ఇచ్చిన ఒక ప్రకటన వల్ల రైతుకు సంబంధించిన ఇన్‌రెన్స్, ఇన్‌పుట్ సబ్సీడి ఇప్పటి వరకు మా బొమ్మనహాళన మండలానికి ఏమీ రాలేదని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోరి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం విలేఖర్లతో మాట్లాడుతూ బొమ్మనహాళ్ మండలం కరువు మండలగా తీసివేసినప్పుడు నుంచి రైతుకు ఇన్సరేన్స్ గానీ ఇన్‌పుట్ సబ్సీడి గానీ యంత్రాలు గాని ఇప్పుదు వరకు రాలేదని, అందుకనే ఆంధ్రప్రదేశ్ కాబోయే సీఎంకి రాయదుర్గం ఎమ్మెల్యే ఎవరైతే వస్తారు వారు రాయదుర్గం నియోజకవర్గం కరువు మండలాలుగా ప్రకటించాలని, రాయదుర్గం నియోజకవర్గం ప్రజలు ఆశయాలను గౌరవించి మా రాయదుర్గం నియోజకవర్గం అనంతపురం జిల్లాలో గౌరవించే విధంగా రాయదుర్గం నియోజకవర్గంలో ఉండాలని రైతులు ఆశయాలు మేరకు కరవు మండలాలుగా రాయదుర్గం కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని ఆయన డిమాండ్. దేశంలోనే అనంతపురం జిల్లా కరువుకాటకాలలో రెండో స్థానంలో ఉందన్నారు. అలాంటి జిల్లాను రైతాంగాన్ని రాబోయే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి ఇంటిలో చోరీ

హిందూపురం టౌన్, మే 24 ప్రభాతవార్త


బీరువా పగులగొట్టిన దృశ్యం

హిందూపురం రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని దశరథ రామయ్యకాలనీలో నివాసం వుంటున్న హిందూపురం రూరల్ కొటిపి పంచాయతీ కార్యదర్శి సుభాషిని నివాసంలో గురువారం అర్థరాత్రి చోరీ జరిగింది. సుభాషిని పట్టణంలోని డిఆర్ కాలనీలో అద్దె ఇంటిలో నివాసం వుంటున్నారు. గత నాలుగు రోజుల క్రితం అనంతపురం వెళ్లారు. ఇది గమనించిన దుండగులు గురువారం తెల్లవారుజామున ఇంటిలోకి చొరబడి పక్కన, పైన వున్న ఇళ్లకు బయట గడియపెట్టి ఇంటిలో ప్రవేశించారు. శుక్రవారం ఉదయం పైనున్న ఇంటి యజమానులు తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా తలుపు రాకపోవడంతో పక్కనున్న వారికి సమాచారం అందించి గడియ తీసి బయటకు వచ్చి గమనించి చోరీ జరిగినట్లు గుర్తించారు. దీంతో ఇంటి యజమాని సుభాషిని దంపతులకు సమాచారం అందించగా వారు వచ్చి చూసి ఇంటిలో వున్న 16 తులాల బంగారం, 40 వేల రూపాయల నగదు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. వెంటనే రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి తనిఖీలు నిర్వహించారు.

## అలరించిన జానపద నృత్యం


మహా సమాధి చెంత ప్రార్ధలను చేస్తున్న బౌద్ధ గురువులు

పుట్టపర్తి రూరల్ మే 24 ప్రభాతవార్త

బుద్ధపూర్ణిమ వేడుకలలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి గ్లోబల్‌కౌన్సిల్‌లోని జోన్ 4 మరియు జోన్ 5 దేశాలకు చెందిన మహిళలు ప్రశాంతినియలంలో శుక్రవారం ఉదయం జయమంగళ గాథను ఆలపించారు. బుద్ధుడు మరియు సవాలును ఎలా అధిగమించాడు. దీని తరువార నేపాల్ నుండి వచ్చిన బౌద్ధసన్యాసులచే వారి సాంప్రదాయ ప్రార్ధనలను ఆలపించారు. ఆదేవిధంగా సాయంత్రం నేపాల్ శ్రీసత్యసాయి సేవా సంస్థలకు చెందిన బాలవికాస్ విద్యార్థులు వారి సాంప్రదాయ జానపద నృత్యన్ని ప్రదర్శించారు. అనంతరం గ్లోబల్‌కౌన్సిల్ ఎన్‌సిపి సభ్యులు మహేంద్రన్ ప్రసంగిస్తూ బుద్ధభగవానుని భోధనలు తనకు మరియు అతని బృందానికి ఎలా సహాయపడిందో ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ట్రస్ట్ వర్గాలు బాలవికాస్ పిల్లలకు నూతన వస్త్రాలను పంపిణి చేశారు. అనంతరం భజన గీతాలు ఆలపించి మహామంగళ హారతిని నిర్వహించారు. దీంతో ప్రశాంతినిలయంలో బుద్ధపూర్ణిమ వేడుకలు ముగిశాయి.


బౌద్ధ సాంప్రదాయ నృత్యం చేస్తున్న బాలవికాస్ విద్యార్థులు

## అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాలలో శాంతియుతంగా మెలగాలి - ఎస్ఐ వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి, మే 24 ప్రభాతవార్త


ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఘర్షణలకు దారి తీసే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఉన్నతాధజకారుల, ఆదేశాల మేరకు, చెన్నేకొత్తపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు, అలాగే, సిబ్బంది ఎపిఎస్‌పి వారితో కలసి గంగినేపల్లి గ్రామం, నందు కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామం నందు కల ట్రబుల్ మాంగర్స్ ఇళ్లు, పాత లిక్కర్ కేసులలో ఉన్న వారి ఇళ్ల సోదాలు నిర్వహించారు. అలాగే గ్రామంలో వాహనాల యొక్క రికార్డులు కూడా చేసి, గ్రామంలో 04 ద్విచక్ర వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలతో ముచ్చటించి రాబోయే రోజులలో శాంతి భద్రతలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా బ్రతకాలని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయి అని హెచ్చరించారు.

## అర్హులైన వారికి రెండో జాబితాలో సబ్సిడి ఇవ్వండి

- మొదటిజాబితాలో పేర్లు గల్లంతుపై రైతుల ఆందోళన

అగళి, మే 24 ప్రభాతవార్త

గత ఏడాది పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడిని ప్రభుత్వం విడుదల చేసింది కానీ, అందులో ఎక్కువమంది అర్హులైన వారికి ఇన్‌పుట్ సబ్సిడి అందలేదని రైతులు ఆంఒదళన వ్యక్తం చేస్తున్నారు. అగళజకి చెందిన డాక్టర్ దేవరాజుకు ఎలాంటి ఇన్‌పుట్ సబ్సిడి రాకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా అరు హ్లైన రైతులు ఇంకా ఉన్నారని, సదరు రైతులకు సంబంధించి పేర్లు జాబితాలో లేవని, ఆ పంట నష్టపోయినా కనీసం ప్రభుత్వం అందించే చిన్న సహాయం కూడా అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు విషయమై ఏఓ శేఖర్‌నాయక్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా గతంలో పంట నష్టపోయిన వివరాలను 9023 మంది రైతులు పంట నష్టపోయినట్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపినట్లు ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. కచ్చితంగా రైతుల పొలాల్లోకి వెళ్లి జియో ట్యాగింగ్ చేసి క్రాప్ బుక్ చేసిన రైతులకు పరిహారం అందించాలి. అవేవీలేకుండా ఇష్టాను సారంగా వ్యవహరిస్తే నిజమైన రైతులు నష్టపోతారని కావున క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడిని అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పేరుకు మండల కేంద్రం.. ఆధార్ కేంద్రం లేక అగచాట్లు..

అగళి, మే 24 ప్రభాతవార్త

పేరుకు మండల కేంద్రమైనా కనీస సౌకర్యాలు అక్కడ కానరావడం లేదు. మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రం మూత పడి 8 నెలలైనా ఇంత వరకు దానికి అతీగతిలేదు. ఆధార్‌కేంద్రంఉంటే, కొత్తగాఆధార్ చేయించుకునేవారు, ఉన్న ఆధార్‌కార్డులో పేర్లతప్పులు, మండలం తప్పు, ఊరుపేర్లు, ఇతర తప్పులు దొర్లి ఉంటే అలాంటివాటిని సరిచేయడానికి ఆధార్ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో ఆధార్ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు వాటిని సరిదిద్దక పోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడున్న ఉద్యోగి సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆధార్ కార్డు సరి చేసుకోవడానికి దరఖాస్తు చేసుకున్నవారు మరొక్కసారి ఖర్చులు పెట్టుకుని మండల పల్లి మడకశిర, శిరు, మధుగిరి, లాంటి ప్రాంతాలకు వ ఎల్లి వాటిని సరి చేసుకుంటున్నారు. కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు అక్కడ సామాన్యులకు సక్రమంగా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రైలు కింద పడి యువకుడు మృతి

ధర్మవరం రూరల్, మే 24 ప్రభాతవార్త


మృతిచెందిన వరప్రసాద్ (ఫైల్‌ఫోటో)

పట్టణంలోని మారుతి నగర్‌కు చెందిన వరప్రసాద్ (30) అనే చేనేత కార్మికుడు రైలు కింద పడి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు వరప్రసాద్ బిటెక్ చదువు పూర్తి చేసుకుని పట్టణములో మరమగ్గాలను నేస్తూ జీవనం కొనసాగించేవాడు. అయితే మగ్గాల ద్వారా నేసిన చీరలకు అన్ సీజన్ వల్ల సరిగా అమ్ముడుపోక నష్టం రావడం వల్ల మనస్థాపానికి గురై, పట్టణంలోఒని గుట్ట కింద పల్లి వద్దగల రైల్వే ట్రాక్ మీద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని చనిపోవడం జరిగింది. బిటెక్ చదివినా కూడా ఉద్యోగం రాకపోవడంతో, కుటుంబ పోషణ నిమిత్తం మరమగ్గల నేస్తూ జీవించేవాడు. మృతునికి ఒక కూతురు భార్య మమత కూడా ఉన్నారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మారుతీ నగర్ ప్రజలు, కుటుంబ బంధుమిత్రులు కోరుతున్నారు. ధర్మవరం రైల్లే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి, సవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని, కుటుంబ సభ్యులకు అందజేశారు.

## ఎన్నికల కౌంటింగ్ వరకు 144 సెక్షన్ పోలీస్ 30 యాక్ట్ అమలు

- ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే నాన్ బెయిలబుల్ సెక్షన్..

చెన్నేకొత్తపల్లి, మే 24 ప్రభాతవార్త


మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ఎన్నికలు, ఫలితాలు, వెలివడే వరకు 144 సెక్షన్, అలాగే పోలీస్ 30 యాక్టు అమల్లో ఉంటుందని, ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. 144 సెక్ష న్ అమల్లో ఉన్నందున ప్రజలు గుమిగూడ రాదని బెట్టింగులకు పాల్పడరాదని హెచ్చరించారు. కౌంటింగ్ జరిగే రోజు అలాగే దానికి ముందుగాని, తర్వాత గాని గ్రామాల్లో గొడవలు జరగకూడదని అనే ఉద్దేశ్యంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలక్షన్ జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని పార్టీలకు చెందిన సుమారు 100 మందికిపైగా బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఈ బైండోవర్ ప్రక్రియ జూన్ 4వ తేది వరకు కొనసాగుతుందని, గ్రామాలలో అల్లర్లు/గొడవలు సృష్టించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వారు ఎంతటి వారైనా సరే వదిలే ప్రసక్తి లేదన్నారు. అవసరమైతే వారిపైన రౌడీషీట్ ఓపెన్ చేయుటమా లేదా జిల్లా బహిష్కరణ చేయించడానికి కూడా వెనుకాడబోమన్నారు. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్ యజమానులు తమ యొక్క కష్టమర్లకు లూజుగా పెట్రోల్, డీజిల్ అమ్ముడము లేదా క్యాన్లకు పట్టడం వంటివి చేయరాదని, అలా చేసిన యెడల చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతపురం అలాగే పుట్టపర్తి జిల్లా వారి ఉత్తర్వుల మేరకు జూన్ 6వ తేది వరకు చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో ఎవరు కూడా ఎలాంటి టపాసులు అమ్మరాదు. వినియోగించరాదని, దీనిని అతిక్రమించిన యెడల సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడుతుందన్నారు.

## రాకెట్ల నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి చిరస్మరణీయులు

-నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త


రాకెట్ల వై.నారాయణరెడ్డి, వై.రవీంద్రనాథ్‌రెడ్డి చిత్రపటాలవద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు

పోరాటాల యోధులు, రైతుల పక్షపాతి రాకెట్ల వై.నారాయణరెడ్డి, వై.రవీంద్రనాథ్‌రెడ్డి చిరస్మరణీయులని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర అనంతపురంలోని తన స్వగృహంలో శుక్రవారం ఆయన తన తండ్రి, సోదరుడు దివంగత రాకెట్ల వై.నారాయణరెడ్డి, వై.రవీంద్రనాథ్‌రెడ్డిల 29వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం, రైతు సమస్యలపైన వారు ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. వారు భౌతికంగా లేకపోయినా వారి పోరాటాల ఫలాలు ఎందరికో అంది వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## రాకెట్ల వై.నారాయణరెడ్డి, వై.రవీంద్రనాథ్‌రెడ్డిలకు ఘన నివాళులు


రాకెట్లలో దివంగత వై.నారాయణరెడ్డి, వై.రవీంద్రనాథ్‌రెడ్డి ఘాట్‌వద్ద నివాళులర్పిస్తున్న వై.మధుసూదన్‌రెడ్డి, వై.నిఖిల్‌రెడ్డి, సీపీఐ నాయకులు

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త

దివంగత కమ్యూనిస్టు నేత రాకెట్ల నారాయణరెడ్డి ఆయన తనయుడు వై.రవీంద్రనాథ్‌రెడ్డిలకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి, యువనేతలు వై.నిఖిల్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. వారి 29వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోగల వారి ఘాట్‌వద్ద శుక్రవారం ఉదయం వై.మధుసూదన్‌రెడ్డి, వై.నిఖిల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులతోపాటు సీపీఐ, కాంగ్రెస్ నాయకులతో కలిసి సమాధులపై పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన కమ్యూనిస్టు యోధుడు రాకెట్ల నారాయణరెడ్డి అని కొనియాడారు. అనంతరం అక్కడ అన్నదాన కార్యక్రమం నిర్వహించి పట్టణంలోని విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాధాశ్రమం, మొట్టమొదటి చిన్న పిల్లల అనాధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారికి భోజన ప్యాకెట్లను రాకెట్ల నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జె.మల్లికార్జున, కె.మనోహర్, డి.సుల్తాన్, పార్వతీప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు యం.అశోక్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు వడ్ల ఆంజినేయులు, సోనియా శీన, అబ్బాస్, సుధాకర్, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై పోలీసులకు పిర్యాదు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

-సమ్మె చేస్తే దాడులుచేసి కక్ష సాధింపులకు దిగుతున్నారని ఆవేదన

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త


ఎస్ఐ రాఘవేంద్రప్పకు పిర్యాదు పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, డీఈఈ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం, రాయదుర్గం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కాంట్రాక్టర్ సూపర్‌వైజర్ సుధాకర్‌రెడ్డిపై శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పోలీసులకు పిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం ఉరవకొండకు వచ్చిన కార్మికులు స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు రంగారెడ్డితో కలిసి రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, యుపీఎస్ ఎస్ఐ రాఘవేంద్రప్పలకు రాతమూలకంగా పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తాము 3 నెలల జీతాలు, పీఎఫ్ బకాయిలు, జీతంలో 2,200 రూపాయలు కోత విధించడంతో ఈనెల 18వ తేదీ సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛందంగా మోటార్లు రన్నింగ్‌లో ఉండగానే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు అప్పగించి విధుల నుండి బయటకు వెళ్లిపోయామన్నారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఈఈలు అధికార బలంతో అర్ధరాత్రి వచ్చి పీఏబీఆర్ పంప్ ఆపరేటర్ వన్నూరుస్వామి ఇంటికి వెళ్లి పంపులు ఆన్ చేయాలని లేనిపక్షంలో విధుల నుండి తొలగిస్తామని బెదిరించారన్నారు. మరికొంతమంది కార్మికులను కూడా బెదిరించడం, అడ్డువచ్చిన ఆడవారిని అసభ్య పదజాలంతో మాట్లాడటం జరిగిందన్నారు. తనకు రావాల్సిన జీతం అడిగినందుకు పీఏబీఆర్ హెల్పర్ హరీష్‌ను నానా దుర్భాషలాడి కాంట్రాక్టర్ సూపర్‌వైజర్ సుధాకర్‌రెడ్డి కాలర్ పట్టుకొని నెట్టాడన్నారు. ఈ విషయమై 22న తాము ప్రశ్నించడంతో అక్కడ వాగ్వాదం చోటు చేసుకొందన్నారు. రాయదుర్గంలో కొంత మంది దళిత కార్మికులపై కక్ష సాధింపులో భాగంగా జీతం కూడా నిలిపివేశారని వాపోయారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈఈతోపాటు సూపర్‌వైజర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.

## విత్తన శుద్ధి తరువాతనే పంట పెట్టుకుంటే చీడపీడల నివారణ

- రాయితీ వేరుశెనగ విత్తనకాయల పంపిణీలో ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త


రైతు భరోసా కేంద్రంవద్ద రైతులకు రాయితీ వేరుశెనగ విత్తనకాయల బస్తాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్

రైతులు పంట పెట్టడానికి ముందు తప్పక విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు పద్మజ, మండల వ్యవసాయాధికారి శుభకర్ సూచించారు. రాయితీ వేరుశెనగ విత్తనకాయల పంపిణీను శుక్రవారం వారు మండల పరిధిలోని పెద్దముష్టూరు రైతు భరోసా కేంద్రంలో లాంఛనంగా ప్రారంభించారు. విత్తనం కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతులకు విత్తనకాయల బస్తాలను పంపిణీ చేసి పలు సూచనలు చేశారు. ఏడీఏ పద్మజ మాట్లాడుతూ ఉరవకొండ డివిజన్‌కు కావలసినంత విత్తన కేటాయింపులు జరిగాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవో శుభకర్ మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసుకోవడంవల్ల తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందని విత్తనం మొకలశాతం పెరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మోపిడి, రాకెట్ల, ఇంద్రావతి రైతు భరోసా కేంద్రాలను తనిఖీచేసి విత్తన పంపిణీను ప్రారంభించారు.

## నేడు కూడా విత్తన వేరుశనగ పంపిణీ
### - మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్


సబ్సిడి విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం


రాచేపల్లిలో విత్తన పంపిణీ చేస్తున్న దృశ్యం

శింగనమల, మే 24 ప్రభాతవార్త

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం సబ్సిడి విత్తన వేరుశనగ పంపిణీ చేయడం జరిగిందని, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్ తెలిపారు. ఆయన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 400 మంది రైతులకు వేరుశనగ పంపిణీ చేయడం జరిగిందని, వేరు శనగ కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతుకలు నేడు కూడా పంపిణీ చేస్తామన్నారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సగం మంది విద్యార్థులు గైర్హాజరు

అనంతపురం న్యూటౌన్, మే 24 ప్రభాతవారత

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా సెంటర్లలో ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు జరిగిన పరీక్షకు 52, 23 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 2576 మంది మాత్రమే హాజరై మిగిలిన 28, 47 మంది గైర్హాజరయ్యారని డిఇఓ బి.వరలక్ష్మి, ఏసి గోవింద్ నాయక్ తెలిపారు. గుంతకల్లులోని రెండు సెంటర్లను డిఈఓ, అనంతపురంలోని మూడు సెంటర్లను ఏసి తనిఖీ చేశారు. మొదటి రోజు ఎక్కడ ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

## డీఈ సెట్ పరీక్షకు 40 మంది గైర్హాజరు

అనంతపురం న్యూటౌన్, మే 24 ప్రభాతవార్త

డీఈ సెట్ పరీక్ష శుక్రవారం ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. నగర శివారు ఎల్‌ఆర్‌జి స్కూల్ సమీపంలో ఉన్న నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చి సోషల్ యాక్షన్ ఇండియాలోని పరీక్ష కేంద్రం జరిగిన పరీక్షకు మొత్తం 343 మంది విద్యార్థులకుగాను 300 మంది హాజరయ్యారని,మిగిలిన 43 మంది గైర్హాజరయ్యారని డీఈఓ బి.వరలక్ష్మి తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఎటువంటి సమస్య లేకుండా సజావుగా జరిపారు. ఈ పరీక్ష కేంద్రాన్ని ఏసి గోవిందనాయక్ పరిశీలించారు.

## విద్యా కానుక స్టాక్ పాయింట్ ఆకస్మిక తనిఖీ
### - జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి..


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

కూడేరు, మే 24 ప్రభాతవార్త

స్థానిక మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యాకా నుక నిల్వవుంచే స్టాక్ పాయింట్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలను ఆమె పరిశీలించారు. ఎన్ని పుస్తకాలు వచ్చాయి, ఇంకా ఎన్ని రా వాల్సి ఉంది. మండలానికి సరిపడా పుస్తకాలు వచ్చాయా లేదా..? రావాల్సి న వాటికి ఎప్పటికప్పుడు ఇ ండెంట్ రెడీ చేసి టెక్స్‌బుక్ గోడౌన్ ఇన్‌చార్జ్‌కి అందించి తగిన పుస్తకాలను పొందాలని డీఈఓ తెలియజేశారు. ఈ క ఆర్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్1, సాయికృష్ణ2, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు వెంకటరమణ, శివ ప్రసాద్, ఆదిలక్ష్మి, ఆంజినేయులు, నాగమణి, సురేంద్రబాబు, ఆదామ్బి, కుంటున్న తదితరులు పాల్గొన్నారు.

## మండల అధికారులతో సమీక్ష సమావేశం
### - తహశీల్దారు రత్న రాధిక..


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహశీల్దారు

కూడేరు, మే 24 ప్రభాతవార్త

స్థానిక మండల తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం తహ శీల్దారు రత్న రాధిక, మండల వ్యాప్తంగా ఉన్న అని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడు తూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు రావచ్చని అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలకు గురి రాకుండా గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రజలను, వారిని అప్రమతం చేయడం, పంట సాగు చేసిన రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డిఎంకె బాషా, డిప్యూటీ తహశీల్దార్ విశ్వనాథ్, ఆర్ఐ ప్రశాంత్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పంచాయితీ సెక్రెటరీలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులను తనిఖీ చేసిన ఎంపిడిఓ బివి.రమణ


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ బివి.రమణ


మామిడి మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

శింగనమల, మే 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని లోలూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఓ బివి రమణ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతూ.. పనులు అడిగిన వారికి కల్పిస్తామని తెలిపారు. ఏరోజు చేసిన పనులను ఆరోజే కొలతలు వేయించుకోవాలన్నారు. అనంతరం ఉపాధిహామీలో పండ్ల మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏపిఓ శ్రీదేవి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం




పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ట్రైనీ కలెక్టరు వినూత్న

అనంతపురం న్యూటౌన్, మే 24 ప్రభాతవార్త

ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షకు జనరల్ విద్యార్థులు 3517 మందికిగాను 3346 మంది హాజరయ్యారు. మిగిలిన 171 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 207 మందికిగాను 195 మంది హాజరై 12 మంది గైర్హాజరు కావడం జరిగింది. అలాగే మధ్యాహ్నం జరిగిన రెండవ సంవత్సర పరీక్షలకు జనరల్ విద్యార్థులు 507 మందికిగాను 479 మంది హాజరు కాగా మిగిలిన 28 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌లో 89 మందికిగాను 85 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలను ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ అనంతపురం పట్టణంలోని కెఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేసి థియరీ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

## కూడేరులో రాయితీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ


రాయితీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కూడేరు, మే 24 ప్రభాతవార్త

మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ విత్తన వేరుశనగ కాయలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వజియ్ కుమార్, మండల తహశీల్దారు రత్న రాధజక, ఎంపిడిఓ కమల్ బాషా, విఎస్ఏ డాక్టర్ శ్రీనివా స్, మండల హార్టికల్చర్ అధికారి నెట్టి కంటయ్య చేతుల మీదుగా విత్తన వేరుశనగ కాయల పంపిణీ ప్రారంభించారు. శుక్రవారం కూడేరు మండల వ్యాప్తంగా అ న్ని రైతు భరోసా కేంద్రాలలో పంపిణీ కార్యక్రమంను ప్రారంభించడం జరిగింది. కూడేరు మండలం అన్ని ఆర్‌బికెలలో 650 మంది రైతులకు 560 క్వింటాళ్ల కె-6 రకం విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయడం జ రిగింది. మండల వ్యాప్తంగా అధజకారి విజయ్‌కుమార్ విలేకరులు తెలియ జేశారు. భారీ వర్షాల సూచన మేర రిజిస్ట్రేషన్ చేసకున్న రైతులు త్వరగా రాయితీ వేరుశనగ కాయలు తీసుకుని వెళ్లవలసిందిగా రైతులకు తెలియజే శారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శైలజా, విహెచ్ఏ సాజియా, మహిళా కానిస్టేబుల్ రమణమ్మ, విపిఏ కుమారి భవాని, కూడేరు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా అక్కమహాదేవతల జాతర


జాతరలో పాల్గొన్న భక్తులు

అమడగూరు, మే 24 ప్రభాతవార్త

మండలంలోని బాయిపల్లి బిల్లూరు కట్టకింద వెలసిన ఏ డుగురు శ్రీఅక్క మహాదేవ తల జాతర శుక్రవారం ఘనంగా ని ర్వహించారు. పూజారి చేలు రు గంగులమ్మ మాట్లాడుతూ ప్రతి ఏడాది మొలకల పున్నమి సమయంలో ఈ జాతరను వేలాది మంది భక్తుల మధ్య ఘనంగా నిర్వ హించడం జరుగుతుందన్నారు. ఈ జాతరకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అక్క మహాదే వతలను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుని వెళుతుంటారన్నారు. పూజలో కూర్చుంటే ఇంటి పరిస్థితులు, ఆరోగ్య పరిస్థితులు అన్ని చెబుతా రని అమ్మవారి ఆశీర్వాదంగా భావించాలని ఆమె పేర్కొన్నారు. ఇందులో భా గంగా దాదాపు 25 మంది ఎలవగంపల భక్తులు ఉపవాసాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు, బాయపల్లి, ఎగువ మిధులు, బిల్లూరు, గంధమారపల్లి గట్టు వివిధ గ్రామాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అనంత నగరంలో కేంద్ర బలగాలతో 4 టౌన్ పోలీసుల ఫ్లాగ్ మార్చ్




ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అనంతపురం, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి

జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాలతో అనంతపురం వనట్‌టౌన్, 4 టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన ర హదారులు, కూడళ్లతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కొనసాగించారు. ఏవైనా సమస్యలుంటే ఆయా స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. గొడవలు, అల్లర్లు, జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లా కేంద్రంలోని నారాయణపురం, తపోవ నం, సంగమేశ్వర సర్కిల్, బసవన్నకట్ట, పాతూరు, వేణుగోపాల్ నగర్, ఆర్టిసి బస్టాండ్ ఏరియాలో ఈ ఫ్లాగ్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం వన్టౌన్ సిఐ రెడ్డప్ప, నారాయణరెడ్డి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిఐలు విజయ్‌కుమార్, ప్రధాన్, మీనాలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు, నగర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి
### - చింత శరత్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న శరత్‌కుమార్‌రెడ్డి

కదిరి, మే 24 ప్రభాతవార్త

రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తనాలు, ఇతర ధాన్యాలు పంపిణీ చేయాలని బిజెపి కిసాన్ మోర్చ ఆర్గానిక్ సేల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సబ్సిడితో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న విషయం విధితమే అన్నారు. అయితే అధికారులు, ప్రభుత్వం నాణ్యత విషయంలో రాజీ పడకుండా మంచి విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాల ద్వారా రైతాంగానికి ఉపయోగంతోపాటు పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అలాగే అంతర పంటలు వేసుకున్న రైతుకలు కంది, మినుములు, పెసల్లు, కొర్రలు, రాగి, ఉలవలు, అలస ందలు వంటి ధాన్యాలు కూడా రైతు కలు అందుబాటులో ఉం చాలని డిమాండ్ చేశారు. అం తర పంట ధాన్యాల సబ్సిడి ధరలు కూడా ప్రభుత్వం వెం టనే ప్రకటించాలని తృణ ధాన్యా లు 8 0 శాతం సబ్సి డిపై రైతులకు సరఫరా చేయాలన్నారు. యువ రైతులు విద్యా వంతులైనటువంటి రైతన్నలు ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, రైతులకు లాభసాటిగా ఉందన్నారు. రైతుల పెట్టుబడుల కోసం అధిక ధరలు, రసాయన ఎరువులు కుని తద్వారా పంట పొలాలు కూడా నిస్సారం అయిపోతున్నాయిన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వేరుశనగ విత్తన కాయలు పంపిణీ



వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న దృశ్యం

యాడికి, మే 24 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వేరుశనగ విత్తన కాయలను పం పిణీ చేశారు. ఈ కార్యక్ర ౕమానికి గుత్తి డివిజన్ సహాయ వ్యవ సాయ సంచాలకులు వెంక టరా ముడు హాజరై రైతులకు వేరు శనగ విత్తన కాయల పంపిణీ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులకు నాణ్య మైన విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతు ందన్నారు. ఎక్కడైనా రైతు భరోసా కేంద్రాల్లో విత్తన నాణ్యత లేకపోతే వెం టనే సంబంధిత లారీని వెనక్కు పంపడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రే షన్ చేసుకున్న రైతులందరికి విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటి వరకు 600 మంది రైతులు 2 వేల బస్తాలకు మండల వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి మహ బూబ్‌బాష, గ్రామ వ్యవసాయ అధికారి రేష్మ, రమేష్, రైతులు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు
### - శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలి - సిఐ నాగార్జునరెడ్డి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ నాగార్జునరెడ్డి

యాడికి, మే 24 ప్రభాతవార్త

ఎన్నికల్లో గెలుపొందిన అభ్య ర్థుల విజయోత్స వ ర్యాలీలకు అనుమతి లేదని ఒకవేళ ఎవరై నా చేస్తే కేసులు నమోదు చేసా ్తమని సిఐ నాగార్జునరెడ్డి పేర్కొ న్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రౌడీషీటర్లపై నిఘా పెంచామన్నారు. టపాసులు అమ్మడం, కొనడం నిషేధమన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన వారు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ జూన్ 6వతేదీ వరకు అమలులో వుంటుందన్నారు. జూన్ 4వతేదీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అభ్యర్థులు, కార్యకర్తలు మరెవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

## కౌంటింగ్ రోజు ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు - సిఐ


గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ గిరిబాబు

యల్లనూరు, మే 24 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు ఎవరైనా గొడవలకు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ గిరి బాబు హెచ్చరించారు. శుక్ర వా రం మండలంలోని బుక్కాపు రం గ్రామంలో గ్రామస్తులతో కలి సి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవిం చా లన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడి ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## 1న హనుమజ్జయంతి


ఆంజనేయస్వామి మూల విరాట్టు

తాడిపత్రిరూరల్, మే 24 ప్రభాతవార్త

పట్టణ సమీపంలోని కడపరోడ్డులో వెలసిన శ్రీయోగివేమన ఆశ్రమంలో జూన్ 1వతేదీ శనివారం హనుమజ్జయంతి వేడుక లను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు విష్ణుస్వామి తెలిపారు. ఇందులో భాగం గా ఉదయం స్వామి వారికి పంచామృ తాభిషేకాలు, వివిధ పుష్పాలతో అల ంకరణ, తదితర పూజా కార్యక్ర మాలు నిర్వహిం చనున్నారు. అదేవి ధంగా భజన, సుందరకాండ ప్రవ చన ం, హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పెద్దఎత్తున భకు ్తలు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని ఆంజనేయస్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన తెలియచేశారు.

## గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ
### - ఈశాన్య పట్టభద్రుల క్షేత్రం స్వతంత్ర్య అభ్యర్థి ఎన్.ప్రతాపరెడ్డి వెల్లడి


పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్.ప్రతాపరెడ్డి

బళ్లారి, మే24, ప్రభాతవార్త; దశాబ్దాల తరబడి ఈశాన్య పట్టభద్రుల క్షేత్రంలో గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరూ పరిష్కరించుకపోవడం శోచనీయమని, ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ల సమస్యల నివారణకై తాను స్వతంత్ర్య అభ్యర్థిగా ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఎన్.ప్రతాపరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారంనాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన జూన్ 3వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయి. ఓటర్ నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్లు బ్యాలెట్ పేపర్‌పై తన చిహ్నం గల బాక్సులో ప్రాధాన్యత సంఖ్య 1 పెన్నుతో నమోదు చేస్తే చాలునని, ప్రాశస్యతపు ఓటుగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ఈశాన్య పట్టభద్రుల క్షేత్రం 7 జిల్లాల్లో 42 అసెంబ్లీ నియోజకవర్గాలతో కూడియున్నదని, గ్రాడ్యుయేట్ ఓటర్లందరూ తప్పనిసరిగా తనకు ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 2018లో జరిగిన పట్టభద్రుల క్షేత్రం ఎన్నికల్లో పోటీచేసిన తనకు గ్రాడ్యుయేట్లు తమ అమూల్యమైన ఓట్లు వేసి మద్దతు తెలిపారని, అయితే కొందరు ఓటర్లు ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం పోలింగ్‌లో పొరపాట్లు చేయడంతో వేలాది ఓట్లు చెల్లని ఓట్లుగా పరిగణించబడ్డాయన్నారు. దీంతో తాను ఓటమి చెందినట్లు ప్రతాపరెడ్డి తెలిపారు. అయినా తిరిగి ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపిన ఆయన, ఈసారి పగడ్బందీగా ఓటర్లలో ఎన్నికలకు సంబంధించి ప్రథమ ప్రాశస్త్యపు ఓటు వేసే విధానం గురించి ఏడు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి అవగాహన కల్పించినట్లు వివరించారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో శైక్షణిక, ఉద్యోగ రంగంలో కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో తాను గెలిస్తే ఎన్‌పీఎస్ యోజనను రద్దు చేసి పాత పెన్షన్ యోజనను జారీలోకి తెచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని తెలిపిన ఆయన, ఉద్యోగుల పోరాటానికి మద్దతు నిస్తానని, అన్ని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా హెచ్‌ఆర్ఏ రేటును 8 నుంచి 16 శాతం పెంచేవిధంగా కృషి చేస్తానన్నారు. కళ్యాణ కర్ణాటక లోని ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలో జరుగుతున్న అన్యాయం గురించి చట్టసభల్లో గళం విప్పి పోరాటం జరుపుతా నని చెప్పారు. ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అతిథి ఉపాధ్యాయులకు, పీయూ కాలేజీల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్ లెక్చరర్లకు కార్మిక చట్టం ప్రకారం కనీస వేతనం, సేవాభద్రత కల్పించేందుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తానని చెప్పారు. అందరూ ఉపాధ్యా యులకు కళ్యాణ కర్ణాటక ప్రాంతాభివృద్ధి మండలి నిధి, జిల్లా ఖనిజ నిధి నుంచి హెచ్చు వేతనాన్ని ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తానని చెప్పారు. ఈ సందర్భంలో నిష్టి రుద్రప్ప, జిల్లా ఆమ్ ఆద్మి పార్టీ నాయకుడు మంజునాథ్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర కాంగ్రెస్ నాయకులకు ఏటీఎంగా ఉంది
### - కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ఆరోపణ


మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి

బళ్లారి, మే24, ప్రభాతవార్త; దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుల పాలిట ఏటీఎంగా ఉన్నదని, ఇక్కడి నుంచే డబ్బు పంపడం మినహా, ఎలాంటి అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు జరగడంలేదని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ఆరోపించారు. ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ క్షేత్రం ఓటర్ల సమావేశానికి హాజయ్యేందుకు బళ్లారికి వచ్చేందుకు ఆయన శుక్రవారంనాడు తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వపు సాధన శూన్యమని, బస్సులకు డీజిల్ లేదని, టీచర్లకు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాలు లేకుండా పోయాయని తెలిపిన ఆయన, రాష్ట్రంలో ఇక శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, గ్యారంటీల జపం తప్పా రాష్ట్ర మహిళల రక్షణకు గ్యారంటీ ఇవ్వడంలేదన్నారు.

హుబ్లీలో నేహా అనే యువతి హత్యను కాంగ్రెస్ వారు తేలికగా జరిగిన ఘటనగా చెబుతుండడం శోచనీయమని, అలాగే అంజలి హత్యపై కూడా ప్రేమికుడు చేసిన దుశ్చర్యగా చెబుతున్నారని, కల బుర్గిలో వ్యక్తిపై కరెంట్ షాక్ వేధింపులకు గురి చేసిన వీడియో వైరల్ అయినా, సదరు ఘటన గురించి ఏమాత్రం స్పందించని ప్రభుత్వం కేవలం నామమాత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపిం చారు. రాష్ట్రంలో అసమర్థ విద్యా మంత్రి కారణంగా ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తీర్ణతశాతం దారుణంగా పడిపోయిందని, రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి ఘోరంగా ఉన్నదని, ఎక్కడా ఒక కి.మీ. రోడ్డు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతి, లంచ గొండితనం తాండవ మాడు తుందన్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, త్వరలోనే ఈ ప్రభుత్వం పతనం గాక తప్పదని జోస్యం చెప్పారు. ఈ సందర్భంలో బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్‌కుమార్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బుడా మాజీ అధ్యక్షుడు దమ్మూరు శేఖర్, మారు తిప్రసాద్, జి.విరూపాక్షగౌడ, హెచ్.హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో కౌంటింగ్ పర్సనల్స్ Iవ ర్యాండమైజేషన్ ప్రక్రియ

## - పారదర్శకంగా కౌంటింగ్ పర్సనల్స్ Iవ ర్యాండమైజేషన్ పూర్తి - 1,354 మంది కౌంటింగ్ పర్సనల్స్ నియామకం - జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, మే 23 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి భవనంలో శుక్రవారం కౌంటింగ్ పర్సనల్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రి యను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమీషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్‌నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ కోసం పారదర్శకంగా కౌంటింగ్ పర్సలన్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ కోసం 1,354 మంది కౌంటింగ్ పర్సనల్స్‌ను నియమించడం జరిగిందన్నారు.

ఎన్నికల కమీషన్ కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సిపిఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్‌ను చేపట్టామని తెలిపారు. ఈ కార్య క్రమంలో రిటర్నింగ్ అధికారులు రాణిస స్మిత, కరుణ కుమారి, వి.శ్రీనివా సులు రెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, జి.వెంకటేష్, పార్లమెంటరీ నియోజకవ ర్గం ఏఆర్ఓ రమేష్‌రెడ్డి, ఈఆర్ఓ శిరీష, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూప రింటె ండెంట్ రవికుమార్, కలెక్టరేట్ ఏఒ అంజ న్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



Iవ ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

# పివికెకె ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

అనంతపురం, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి

జిల్లాలో గత 16 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దిన పివికెకె ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ కమిటీ గ్రేడ్ గుర్తింపును ఇచ్చింది. దేశంలోని ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలను పెంపొందించుచడానికి యూజిసి న్యాక్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చైర్మన్‌గా ఒక త్రిసభ్య కమిటీ పివికెకె కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ నిపుణులు విద్యార్థులతో బోధన, బోధనేతర సిబ్బందితో పూర్వ విద్యార్థులతో, తల్లిదండ్రులతో, యాజమాన్యంతో సంభాషించి వీరం దరి అభిప్రాయాలను పరిగణించి, అక్కడి విద్య, వసతులు, విద్యార్థుల ప్రతిభ పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అమలు, విద్యా బోధన స్థాయి, పరిశోధన దిశగా పురోగతి, మౌలిక సదుపాయాలు, విద్యార్థి పురోగతి, కళాశాల విశ్వసనీయత, అ త్యున్నత ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నత విద్యా అర్హతలు కలిగిన ఆచార్యుల నిష్పత్తి తదితర పలు అంశాలను పరిశీలించి పివికెకె ఇంజినీరింగ్ కళాశాలకు ఏ గ్రేడ్ కళాశాల గుర్తింపునిచ్చారు. ఈ కమిటీ కళాశాలలో విద్యార్థుల అభివృద్ధి కొరకు అవలంభిస్తున్న పివి కెకె ఐటి హానర్స్ సొసైటీ, విద్యార్థులలోని నాయకత్వ లక్షణాలను పెంపొందించే క్యాంపస్ రేడియో, ఐడియా క్లబ్‌లను ప్రత్యేకంగా అభినందించి, 700కుపైగా కంప్యూటర్స్, లైబ్రెరీలో 43 వేల పైచిలుకు వివిధ పుస్తకాలు, ప్రతి తరగతికి ఒక ప్రొజెక్టర్, విశాలవంతమైన తరగతి గదులు కలిగి పచ్చని చెట్ల నడుమ సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కళాశాల భవనాలను గమనించి అభిన ందించారు. గత 5 సంవత్సరాలుగా పెరుగుతున్న ప్లేస్‌మెంట్స్ ఉత్తమ స్థా యి ప్రయోగశాలలు, క్రీడా ప్రాంగణాలు, వ్యాయామ శాలలు, మొదలగు సౌకర్యాలను చూసి ప్రశంసించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్ మా ట్లాడుతూ.. అతి త్వరలో పివికెకె ఐటి అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందుతోందని తెలియజేశారు.



మాట్లాడుతున్న పల్లె వెంకట కృష్ణ కిషోర్



పివికెకె ఇంజినీరింగ్ కళాశాల

# సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశీలించిన జెడ్పీ డిప్యూటీ సీఈఓ

## - జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఉరవకొండలో తాగునీటి సమస్యకుగల కారణాలపై ఆరా - నూతన పంపుసెట్ల కేటాయింపు, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై వివరాల సేకరణ

**వార్త ప్రభావం**

ఉరవకొండ, మే 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని నింబగల్లు గ్రామం వద్దగల సీపీడబ్ల్యూ స్కీమ్‌కు చెందిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను శుక్రవారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి తనిఖీ చేశారు. ఉరవకొండ పట్ట ణంలో నెలకొన్న తీవ్ర మైన తాగునీటి ఎద్దడితో ప్రజలు పడుతున్న ఇబ్బ ందులపై 'వార్త'లో 'కలెక్టర్ గారు. .ఉరవకొండ ప్రజల తాగునీటి కష్టా లను గుర్తించండి..!' అన్న శీర్షికన ప్రత్యేక కథనం వెలువడటంతో ఆయన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించారు. నీరులేక అడుగంటి పోయిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశీలించి ఇందుకుగల కారణాలను స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్ సహ్రీన్ ద్వారా తెలుసుకున్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీరు అడుగంటిపోగా ఉరవకొండ ప్రజలకు ఎక్కడి నుండి నీటి సరఫరా చేస్తున్నా రని ఆరా తీశారు. ఈ సందర్భంగా జరిగిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులవద్ద వేసిన 4 బోర్‌వెల్స్‌కు పంపుసెట్ల అవసరాన్ని నమోదు చేసు కున్నారు. శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకం కార్మికులు సమ్మె విరమించిన ందున గురువారం రాత్రి నుంచి ఉరవకొండకు పీఏబీఆర్ నీరు వస్తోందని డీఈఈ డిప్యూటీ సీఈ ఓకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ లైన్ మెన్‌లు కుళ్లాయప్ప, శ్రీరాములు, స్కీమ్ సబ్ కాంట్రాక్టర్ మహా నందరెడ్డి, నింబ గల్లు పంచాయతీ కార్యదర్శి వెంక టేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈతో వివరాలు తెలుసుకొంటున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి

# ఆర్థిక లావాదేవీలను కులాలకు ఆపాదించడం తప్పు

## - వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర మహిళా విభాగా ప్రధాన కార్యదర్శి బండి లలితా కళ్యాణి

శింగనమల, మే 24 ప్రభాతవార్త

ఇద్దరి వ్యక్తుల మధ్య ఏర్పడ్డ ఆర్థిక లావాదేవీలను కులాలకు ఆపాదించడం తప్పని వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర మహిళా విభాగా ప్రధాన కార్యదర్శి బండి లలితా కళ్యాణి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. గత 20 రోజుల క్రితం వైఎస్ఆర్‌సిపిలో ఉన్న పట్నం నగేష్, వైసీపీ మండల నాయకులు బొమ్మనశ్రీరామిరెడ్డితో కలిసి అనేక కాంట్రాక్టు పనులను చేయడం జరిగిందని, అలాగే బొమ్మన శ్రీరామిరెడ్డికి జిఎస్‌టి లేక తాను చేసిన వర్క్ బిల్లులు కూడా పట్నం నగేష్ ఖాతాలోకి వేసేలా చేయడంతో వచ్చిన డబ్బు అడిగితే బిసిలపై దాడిగా అభివర్ణించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఇంటి వద్దకు పంచాయితీకి పిలిచి దౌర్జన్యం చేస్తున్నారని అనడం ఏ మాత్రం సబబు కాదని, ఆర్థిక లావాదేవీల సమస్య ఇరు వర్గాలుకూర్చుని సామరస్యంగా పరిష్కరిం చుకోవాలని అన్నారు. లేనిపోని ఆరోపణలుచేస్తూ రెచ్చగొట్టే పద్ధతి మానుకో వాలని ఆమె విమర్శించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి.నారాయణ మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో పట్నం నగేష్ వారి అమ్మను సర్పంచుగా గెలిపించుకుందామని, అంతేకాకుండా పట్నం నగేష్‌ను అతి చిన్న వయస్సులో మండల కన్వీనర్‌గా నియమించి ప్రోత్స హించామని రూ.5కోట్లతో వాటర్ షెడ్డు పనులకు ఆయనను అధ్యక్షునిగా నియ మించామని, ఇంత కన్నా పార్టీ ప్రోత్సహించిం దనిచెప్పడానికి ఇవి ఉదాహరణలు చాలవా అన్నారు. బిసిలకు వైఎస్ఆర్ సిపితో న్యాయం జరిగిందని, ఆర్థిక లావాదేవీలు డబ్బులు చెల్లించ డానికి కుంటి సాకులు చెబు తూ, ఇటువంటి ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. అనంతరం వైకా పా మండల కన్వీనర్ చిక్కాల బాలకృష్ణ మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపి బిసి లకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించిందని, కురబ కులానికి చెందిన తనను అతి చిన్న వయస్సులోనే మండల కన్వీనర్ చేసిందని, అనేక నామి నేటెడ్ పోస్టుల్లో కూడా బిసిలకు అధిక ప్రాధా న్యత కల్పించిన పార్టీ వైసీపీ అని అన్నారు. మరోసారి బొమ్మశ్రీరామిరెడ్డిపై ఆరోప ణలు చేసేటప్పుడు ఆలోచించుకుని చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు బ్యాళ్ల శ్రీనివాసులు, శరత్ చంద్రారెడ్డి, ఆది, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ నేతలు

# ఏపిఓ నారాయణస్వామిని వెంటనే సస్పెండ్ చేయాలి

## - డీఈఓ, సమగ్రశిక్ష ఏపిసికి ఆర్‌ఈఎఫ్ వినతి

అనంతపురం న్యూటౌన్, మే 24 ప్రభాతవార్త

దళిత ఉద్యోగులను అనుమాన పరుస్తున్న సమగ్ర శక్ష ఏపిఓ జె.నారాయణస్వామిని వెంటనే సస్పెండ్ చేయాలని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ హెచ్.రామచంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం సమగ్ర శిక్ష ఏపిసి వరప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అనేక సంవత్సరాలుగా సమగ్ర శిక్ష కార్యాలయంలో పనిచేస్తూ ప్రస్తుతం ఏపిఓగా పని చేస్తున్న జె.నారాయణస్వామి నిత్యం దళిత ఉద్యోగుల పట్ల అహంకార పూరితంగా ప్రవర్తిస్తూ అవమాన పరుస్తున్నారు.

వివాదాలకు కేంద్రబిందువుగా ఉంటూ, అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదులకు వచ్చా యన్నారు. అతనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం వలన ప్రస్తు తం కూడా సమగ్రశిక్షలో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. అధజకారిక పనుల కోసం వినియోగించాల్సిన వాట్సాప్ గ్రూపులను తన సొంత పనులు, కుల వివక్షకు సంబంధించిన అంశాలను షేర్ చేస్తూ అధికార దుర్విని యో గానికి పాల్పడుతున్నారన్నారు. అంతేకాకుండా గత డిఈఓగా సాయిరాం ఉన్నప్పుడు ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, అనదికారికంగా సీసీగా కొనసాగు తూ కొన్ని నెలలపాటు విధులు దుమ్మాకొట్టారన్నారు. విధుల దుమ్మా కొట్టిన సమయంలో డిఈఓతో సిబ్బం దిపై ఒత్తిడి చేయించి జీతాలు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. అతను పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్ప డానికి ఇష్టం లేక సమగ్ర శిక్షలోనే ఫారిన్ సర్వీస్ కింద గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నారన్నారు. అతను పని చేసిన ప్రతి పాఠశాలలోనూ వివాదాస్పదంగా వ్యవహరిస్తూ సాటి ఉపాధ్యాయులను కూడా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. కావున ఏపిఓ అవినీతి, అక్రమాలపై విచారణ చేసి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆర్ఇ ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇందు కు ఈపీసీ స్పందిస్తూ.. ఏపిఓపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా సాయంత్రం డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దండోరా జిల్లా అధ్యక్షులు హెచ్.అక్కులప్ప, ఆర్ఇఎఫ్ నాయకులు నాగరాజు, శ్రీకాంత్, నగేష్ పాల్గొన్నారు.



ఏపిసికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఇఎఫ్ నాయకులు

# పివికెకె ఐటి పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా జాబ్ అచీవర్స్ డే

అనంతపురం, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి

స్థానిక రుద్రంపేట వద్ద గల పివికెకె పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ జాబ్ అచీవర్స్‌డే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ సంవత్సరం వివిధ కంపెనీల ద్వారా ఎంపికైన ఈసిఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగానికి చెందిన పివికెకె ఐటి పాలిటెక్నిక్ విద్యార్థిని, విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్స్ అందించడం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీ బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డా.పల్లె వెంకట కృష్ణ కిషోర్, ఎం.జి .ప్రదర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అధిత్య మధాని హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లా డుతూ.. మా కళాశాలలో విద్యతోపాటు ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా బోధనా సరళి ఏర్పాటు చేశామని, తద్వారా ప్రతి విద్యార్థి బంగారు భవిష్యత్తు సొంతం చేసుకున్నాడని తెలిపారు. శ్రీ ఆదిత్య మధాని మాట్లాడుతూ.. ఈ కళాశాలలో విద్యార్థులు పట్ల ఇంత శ్రద్ధ కనబరచి వారి భవిష్యత్తు తీర్చి దిద్దుతున్న కళాశాల సిబ్బందిని అభినందించి, అనంతపురం విద్యార్థుల ఉన్నతికి నా తరపు మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.యన్.యస్.వైభవ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మరి ఎన్నో కంపెనీలను, ఎన్నో అవకాశాలు కల్పిస్తాము అని తెలిపారు.



జాబ్ అచీవర్స్‌తో కళాశాల చైర్మన్ తదితరులు

# రైతులు ఆశించిన దిగుబడులు సాధించాలన్నదే మా లక్ష్యం

## - మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర - ఆర్బీకేల్లో విత్తన వేరుశెనగ పంపిణీ ప్రారంభం

పామిడి, మే 24 ప్రభాతవార్త

వేరుశెనగ పంట సాగులో రైతులు ఆశించిన దిగుబడులు సాధించాలన్నదే మా లక్ష్యం అని ఆధిశ:గా వారికి అవసరమైన సహకారాన్ని అందించేందుకు సిద్దంగా ఉన్నామని మండల వ్యవసాయ అధి కారిణి లీనా వసుంధర పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర వేరువెనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా లీనా వసుంధర మాట్లాడుతూ రైతులకు అమలు చేస్తున్న పథకాలు, పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పరికరాలను ఆర్బీకేల ద్వార అందజేస్తూ వారికి వ్యవసాయశాఖ సేవలను మరింత అందుబాటులోకి తీసు కొస్తున్నామని తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతన్నల పంట సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 40 శాతం సబ్సీ డీతో విత్తన వేరుశెనగ పంపిణీని చేపట్టడం జరిగిందని అందువల్ల వేరు శెనగ పంటను సాగు చేసే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకంతో సంబందిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్ళి ఆధార్ బయోమెట్రిక్ ద్వార వేరు శెనగ విత్త నాలను పొందాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో వేరుశె నగ విత్త నాల కొరకు రిజిస్ట్రేషన్ చేసు కున్న 1284 మంది రైతులకు గాను డబ్బు చెల్లించిన రైతులకు వరుస క్ర మంలో విత్తన పంపిణీ చేపడుతు న్నామని ఇప్పటివరకూ వారికి 1126.50 క్విం టాళ్ళ విత్తనాన్ని కేటాయి ంచటం జరిగిందన్నారు. వేరుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, విఏఏలు, ఎంపిఈఓలు, విఏఎస్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర.



వేరుశెనగ విత్తన పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారిణి లీనా వసుంధర.

# హీమో ఫీలియాపై అవగాహన తప్పనిసరి

## - మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు

అనంతపురం, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి

అనంతపురం హీమోఫీలియా సొసైటీ కార్యదర్శి కృష్ణమూర్తి, రోచ్‌కార్యదర్శి డాక్టర్ ఉపేంద్రకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలో సుశ్రుత హాల్‌లో హీమో ఫీలియా (రక్త స్రావ కారకం) పైన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, డాక్టర్లకు, హౌస్ సర్జన్లకు అవగాహన కార్యక్రమాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఈఎస్ఐ ఆసుపత్రి హెమటాలజిస్ట్ డాక్టర్ విక్రమ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా హీమో ఫీలియా వ్యాధి లక్షణాలను, నివారణను, నిర్ధారణ పరీక్షలను పరిశోధనలను, సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రక్తం గడ్డకట్టడంలో సహాయ పడే రక్త పలకికల కారకాలు జన్యుపరంగా, అనువంశికంగా లోపించి ఉండడం వలన ఈ వ్యాధజ సంక్రమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడ మిక్‌వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచార్య షారోన్ సోనియా, విశ్రాంత సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జగన్నాథ్, టిబి అండ్ చెస్ట్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ రామస్వామి అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్‌లు ఆచార్య డాక్టర్ నవీన్, ఆచార్య డాక్టర్ శంషాబే గం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు

# కిమ్స్ సవేరాలో అరుదైన వైద్య చికిత్స

## - 11 ఏళ్ల బాలుడికి కడుపులో మెలితిరిగిన పేగునకు ఆపరేషన్ చేసిన వైద్యులు

అనంతపురం సిటీ, మే 24 ప్రభాతవార్త

అత్యంత అరుదుగా పెద్ద వయస్సుల వారికి వచ్చే ఇబ్బంది 11 ఏళ్ల బాలుడికి రాగా, కిమ్స్ సవేరా వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించి బాలుడి సమస్యను పరిష్కరించారు. కిమ్స్ సవేరా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ షాహిద్ తెలిపిన వివరాల మేరకు సత్యసాయి జిల్లా శేషాపురంకు చెందిన 11 ఏళ్ల బాలుడు కిరణ్‌కుమార్ తరచూ విపరీతమైన కడుపు నొప్పి, వాంతులతో గత ఐదేళ్లుగా ఇబ్బంది పడుతుండగా రెండు నెలలుగా సమస్య మరింత పెరిగింది. ఎన్నో ఆసుపత్రుల్లో చూపించుకున్న సమస్యను గుర్తించక పోవడంతో నగరంలోని కిమ్స్ సవేరాకు బాలుడిని తీసుకొచ్చారు. పలు పరీక్షలు నిర్వహించగా పేగులు మెలిగిగినట్లు వైద్యులు గుర్తించారు. లాట్స్ ప్రొసిజర్ అత్యాధునిక విధానంతో ఆపరేషన్ నిర్వహించారు. జిల్లాలో ఇలాంటి వైద్య సేవలు అందించడం తొలిసారి అన్నారు. పేగులు మెలితిరగడం అనేది పుట్టుకతో వచ్చే సమస్య అని దీనివల్ల కడుపులో అన్ని అడ్డం పడి పలు రకాల పేగుల సమస్యలు వస్తాయని, దీర్ఘకాలిక సమస్య ఉంటుందన్నారు. అత్య ంత అరుదుగా ఇలాంటి సమ స్యలు ఉత్పన్నమవుతు న్నాయ న్నారు. బాలుడి సమస్యను శస్త్ర చికిత్స ద్వారా బాగు చేసి మూడు రోజుల వ్యవధిలోనే డిశ్చార్జ్ చేయడం జరిగిందన్నా రు. ఇలాంటి సమస్యలకు కిమ్స్ సవేరాలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.



శస్త్ర చికిత్స పొందిన బాలుడితో వైద్యులు

# సహకారం ఒక జీవన విధానం..

## - సభ్యులను భాగస్వాములు చేస్తేనే బ్యాంక్ అభివృద్ధి - ది విశాఖ కో - ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ - ఇన్‌చార్జ్ డైరెక్టర్ జివి.సత్యనారాయణమూర్తి

అనంతపురం, మే 24 ప్రభాతవార్త బ్యూరో

సహకారం ఒక జీవన విధానంగా నమ్ముతున్నదని ఒకరికోసం అందరూ అందరి కోసం ప్రతి ఒక్కరు అనే నినాదంతో ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క కార్యక్రమాలను సభ్యులకు వివరంగా తెలియజేస్తున్న ఏకైక కో-ఆపరేటివ్ బ్యాంక్ అని ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ జెవి.సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో 2023-24 అనంతపురం బ్రాంచ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ పి.నారాయణస్వామి అధ్యక్షత వహించగా, ఇన్‌చార్జ్ డైరెక్టర్ జెవి.సత్యనారాయణ మూర్తి, బ్రాంచ్ మేనేజర్ తట్టుపర్తి ఉదయ్ కృష్ణ సురేష్, జోనల్ మేనేజర్ హైదరాబాద్ జోన్ పి.ప్రసాద్‌రావు, గుత్తి బ్రాంచ్ విశాఖ కోఆపరేటివ్, బ్యాంక్ చైర్మన్ జిలాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతపురంలో ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఫిబ్రవరి 12. 2017లో ప్రారంభించడం జరిగి ందన్నారు. ప్రస్తుతం కోపరేటివ్ సభ్యులుగా 549 మంది ఉన్నార న్నారు. అనంతరం బ్యాంక్‌లోగల డిపాజిట్లు తదిత రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం బ్రాంచ్ కోఆపరేటివ్ అధికారులు సభ్యు లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్ జివి.సత్యనారాయణమూర్తి

# సబ్సిడీ వేరుశనగ విత్తనం పంపిణీ

బుక్కరాయసముద్రం, మే 24 ప్రభాతవార్త

ఖరీఫ్ సాగులో వేరుశనగ విత్తనం వేసేరైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనంను శుక్రవారం పంపిణీచేసినట్లు మండల వ్యవ సాయాధికారి శ్యామ్‌సుం దర్‌రెడ్డి తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి బుక్కరాయసముద్రం మండలంలో వేరుశనగ విత్తనం కొరకు ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు 1893మంది ఇందులో 14 రైతు భరోసా కేంద్రల్లో విత్తనం కొరకు నమోదుచేసుకొని నగదు చెల్లించిన వారికి 936మంది రైతులకు 794.4క్వింటాల కదిరి.6 విత్తనం పంపి ణీచేయడం జరిగిందన్నారు నేడు కూడ విత్తనం పంపిణీచేయడం జరుగు తుంది.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనం పంపిణీచేస్తున్న మండల వ్యవసాయాదికారి

# 10వ రోజు సమ్మర్‌క్యాంపు

అనంతపురం న్యూటౌన్, మే 24 ప్రభాతవార్త

జిల్లా గ్రంథాలయ సంస్థ అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయం అనంతపురంలో సంస్థ కార్యదర్శి రమ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరము 10వ రోజు కార్యక్రమాలు 8 నుంచి 8:30 యోగ, 8:30 నుంచి 9:00 డ్రాయింగ్, 9:00 నుంచి 10:00 వరకు కథలు, పద్యాలు చెప్పడం, 10 నుంచి 10:10 విరా మం, 10:10 నుంచి 11:00 పుస్తక పఠనం, 11:00 నుంచి 11:30 డాన్స్ రమేష్ అకాడమీ ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.రమ, సహాయ గ్రంథాలయ అధికారి ఇంతియాజ్ అహ్మద్, కావేరి, నాగమణి, ఉజ్జినేశ్వరి తదితరులు పాల్గొన్నారు. 58 మంది విద్యార్థులు హాజరైనారు శుక్రవారం సమ్మర్ క్యాం పులో రిసోర్స్‌పర్సన్ ఎం.వెంకటేషప్ప, రమేష్, మహేష్, అలాగే విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమానికి విజయవంతం చేశారు.



సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

# బాధితులను పరామర్శించిన ముంటిమడుగు కేశవరెడ్డి

శింగనమల, మే 24 ప్రభాతవార్త

ఇటీవల మండల పరిధిలోని శివపురం గ్రామంలో ఇరు వర్గాల ఘర్షణలో గాయపడ్డ వారిని శుక్రవారం తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. మీ అందరికీ తోడుగా ఉంటాం.. ఇకపైన ఇటువంటి సంఘటనలు జరగకుండా అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. గాయపడిన పెద్దన్న, కుమారి పద్మజలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె వైసీపీ కన్వీనర్ పాండు, నాగార్జున, రాంభూపా ల్‌రె డ్డి, నాగభూషణ, కల్లప్ప, పుల్లన్న, కుండప్ప తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

# ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

అనంతపురం న్యూటౌన్, మే 24 ప్రభాతవార్త

బిసి స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 2 మెయిన్స్‌కు ఇస్తున్న ఉచిత శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు కుష్బూ కొఠారి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నగరంలోని బిసి స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 మెయి న్స్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కుష్బూ కొఠారి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు గ్రూప్-2 మెయిన్స్‌లో వచ్చే సిలబస్‌ను వివరిస్తూ పలు సూచనలు ఇచ్చారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టడీ సర్కిల్‌లో గల లైబ్రరీ తెరచి ఉంటుందని, ప్రతి ఒక్కరూ తరగతుల అనంతరం లైబ్రరీని లోని పుస్తకాలను చదువుతూ, ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని నోట్ చేసుకుంటూ వాటిని శ్రద్ధగా చదువుకొని మెయిన్స్‌లో విషయం సాధజంచాలని ఆకాంక్షించారు. శిక్షణ తరగతులు 60- రోజుల పాటు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోర్సు -కో ఆర్డినేటర్ రవీంద్ర అకౌం టెంట్ వెంకటసుబ్బయ్య, లైబ్రేరియన్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ జయ ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిడి కుష్బూ కొఠారి

# జూన్ 4న జరిగే కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ ఆఫీసులో నిర్వహించిన సమావేశానికి హాజరైన టిడిపి నేతలు





కార్యక్రమానికి హాజరైన టిడిపి నేతలు

అనంతపురం అర్బన్, మే 24 ప్రభాతవార్త

జూన్ 4వ తేదిన అనంత పురం నగరంలో నిర్వహించే కౌం టింగ్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ నిర్వహించిన సమావేశానికి అనంతపురం పార్లమెంట్ అధ్య క్షులు జి.వెంకట శివుడు యాదవ్, పార్టీ పొలిట్ సభ్యులు కాలవ శ్రీనివాసులు, శింగనమల నియో జకవర్గ చీఫ్ ఎలెక్షన్ ఏజెంట్ ఆలం నరస నాయుడు, లీగల్ సెల్ నాయకులు ఆదెన్న, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కౌంటింగ్ రోజున పటిష్ట భద్రత మధ్య కౌంటింగ్ నిర్వహించాలని, ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సందర్భంగా అదనంగా మరొక టేబల్ ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు కోరారు.